సాక్షి ఒడిశా

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,36,314లు, బంగారం 330 మిల్లీగ్రాములు, వెండి 1.25గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



ఆద్యంతం.. ఆనందం - 8లో



గుణుపూర్‌లో రోడ్డు విస్తరణకు చర్యలు - 8లో

న్యూస్‌రీల్

స్వాభిమాన్ ఏరియాలో వైద్యసేవలు



గిరిజనులకు సేవలందిస్తున్న వైద్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జంత్రి పంచాయతీ తాబేరు గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఖొయిర్‌పుట్ సమితి కుడుములగూడ ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యులు సంతోష్‌కుమార్ షడంగి తన సిబ్బందితో కలిసి కొండలపై ఉన్న తాబేరు గ్రామానికి 8కిలోమీటర్లు నడిచి, చేరుకున్నారు. గిరిజనులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వివిధ వ్యాధులు, జాగ్రత్త చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పేదల డాక్టర్ మంజిత్ సింగ్ మృతి



డాక్టర్ మంజిత్ సింగ్ (ఫైల్)

జయపురం: స్థానిక పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో పేదల వైద్యుడిగా పేరొందిన డాక్టర్ మంజిత్ సింగ్(77) గురువారం మృతిచెందారు. కొద్ది రోజుల క్రితం అస్వస్థతకు గురై, ఆస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ ప్రాణాలొదిలారు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు నీలకంఠేశ్వర మందిర ప్రాంతంలోని ఆయన నివాసానికి చేరుకొని నివాళులర్పించారు. 1968లో బరంపురం మహారాజా కృష్ణ చంద్ర దేవ్ మెడికల్ కళాశాల నుంచి డాక్టర్ పట్టా పొందిన మంజిత్.. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడిగా చేరారు. అయితే మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఉద్యోగాన్ని వదిలారు. జీవితాంతం ప్రజా సేవలోనే గడిపారు. పేద వర్గాలకు అందించిన సేవలకు మెచ్చి వివిధ సందర్భాల్లో ఎన్నో సత్కారాలు, ప్రశంసలు అందుకున్నారు. అలాగే జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, మాజీమంత్రి రబి నారాయణ నందో, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్, బీఆర్ఎస్ నాయకుడు రవీంద్ర మహాపాత్రొ, నాయకులు, కార్యకర్తలు వైద్యుడి భౌతిక కాయాన్ని దర్శించుకొని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన మృతి పేద ప్రజలకు తీరని లోటని అభిప్రాయం వ్యక్తంచేశారు.

కేంద్రమంత్రి జర్దోష్‌తో కోడూరు భేటీ



కేంద్రమంత్రి దర్శనా జర్దోష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరావు

పర్లాకిమిడి: కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి దర్శనా జర్దోష్‌ను పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ఢిల్లీలో గురువారం కలిశారు. అమృత్ భారత్ రైల్వేల అభివృద్ధిలో భాగంగా ఒడిశాలోని గజపతి జిల్లా పర్లాకిమిడి స్టేషన్ అభివృద్ధి పనులు, విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు పర్లాకిమిడి, గుణుపురం వరకు పొడిగింపు చేపట్టాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

ఆర్‌ఎంఈయూ నూతన కార్యవర్గం



కొలువుదీరిన నూతన కార్యవర్గం

రాయగడ: రాయగడ మోటార్ ఎంప్లాయీస్ యూనియన్(ఆర్‌ఎంఈయూ) నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. పట్టణంలోని కపిలాస్ కూడలో ఉన్న కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని న్యాయవాది సునీల్ ఖొరో ప్రకటించారు. యూనియన్ అధ్యక్షుడిగా సునీల్ ఖొరో, ఉపాధ్యక్షుడిగా ముచ్చి రమణ, సాధారణ కార్యదర్శిగా వై.సాంబమూర్తి, సహాయ కార్యదర్శిగా బి.శంకరరావు, కోశాధికారిగా అల్లం శివ నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రెడ్డి గౌరీశంకరరావు, డి.దాస్, ఎం.సత్యనారాయణ, కె.భానుప్రసాద్, కె.ప్రసాదరావు ఎన్నికయ్యారు. కార్మికుల శ్రేయస్సు కోసం ఆవిర్భవించిన సంఘం.. వారి సంక్షేమానికి అంతా కలసికట్టుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చిన్నారులకు హాకీ బ్యాట్‌లు అందిస్తున్న మంత్రి జగన్నాథ సరక, కలెక్టర్ సింగ్



డంగ్రియా దంపతులకు ఆర్థికసాయం అందిస్తున్న మంత్రి, కలెక్టర్

- రాష్ట్రమంత్రి జగన్నాథ సరక
- రూ.16 లక్షల డీకేడీఏ నిధులతో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం

రాయగడ: ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లాలోని బిసంకటక్ సమితి పరిధిలో ఉన్న నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న డొంగ్రియా గిరిజన గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి రైతుల సౌకర్యార్థం ఒపిలిపి, డొంగ్రియా కొందో డెవలప్‌మెంట్ ఏజెన్సీ(డీకేడీఏ) ఆధ్వర్యంలో సుమారు రూ.16 లక్షల వ్యయం, 10టన్నుల సామర్థ్యంతో నిర్మించిన శీతల గిడ్డంగిని మంత్రి ప్రారంభించారు. కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు ప్రజలు పండిస్తున్న వివిధ రకాల కూరగాయలు, పండ్లను నిల్వ చేసుకునే అవకాశం నిల్వ కేంద్రంతో కలిగిందన్నారు. ఇప్పటి వరకు వారు పండించే పంటలు విక్రయాలకు సంబంధించి సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఆశించినంత లాభాలను పొందలేక పోతున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిధులు కేటాయించిందని వివరించారు.

దంపతులకు ఆర్థిక సాయం

కొండకోనల్లో నివసించే ఈ ప్రాంత ప్రజలు తక్కువ వయస్సులో బాల్య వివాహాలు చేసుకునేవారని, వారి అమాయకత్వమే దీనికి కారణమని మంత్రి జగన్నాథ సరక అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే వారిలో కూడా సామాజిక చైతన్యం ప్రారంభమమైందన్నారు. డొంగ్రియా తెగకు చెందిన ఎంతోమంది యువతీ, యువకులు ఉన్నత విద్య అభ్యసిస్తుండటం అభినందనీయమని తెలిపారు. కుర్లి గ్రామంలో నివసించే రాధాకాంత జకసిక, కబి సికక 20 ఏళ్లు దాటిన తరువాత వివాహం చేసుకుని, ఉదాహరణగా నిలిచారని ప్రసంశించారు. ఈ సందర్భంగా ఇరువురినీ జిల్లా యంత్రాంగం తరఫున అభినందిస్తూ రూ.20 వేల ఆర్థిక సాయాన్ని కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ సమక్షంలో అందించారు. ఇదిలా ఉండగా కుర్లి, కజుర గ్రామాల్లో నివసిస్తున్న 48మంది యువతీ, యువకులకు జిల్లా యంత్రాంగం సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం కుర్లిలో ఈకో కాటేజ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం డొంగ్రియా చిన్నారులకు క్రీడలపై ఆసక్తి కనబరిచేలా 11మందికి హాకీ స్టిక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్‌పర్సన్ అనసూయ మాఝి, బిజూ స్వస్థ్య సమితి ముఖ్య సలహాదారులు సుధీర్‌దాస్ పాల్గొన్నారు.



కోల్డ్ స్టోరేజ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సరక

సీబీఐ విచారణకు హైకోర్టు నిరాకరణ



హైకోర్టు (ఫైల్)

- మంత్రి నవకిశోర్ దాస్ హత్య ఘటనపై న్యాయస్థానం నిర్ణయం




మంత్రి నవకిషోర్ దాస్(ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్రమంత్రి నవకిషోర్ దాస హత్య కేసు ఘటనపై సీబీఐ విచారణకు హైకోర్టు నిరాకరించింది. ఈ ఘటన జరిగి 11రోజులు మాత్రమే గడిచాయని, మరోవైపు విచారణ ముమ్మరంగా కొనసాగుతోందని గుర్తుచేసింది. ఈ దశలో చొరవ కల్పించుకుని సీబీఐ విచారణకు ఆదేశించడం సబబు కాదని న్యాయస్థానంలో దాఖలైన పిటిషన్‌పై విచారణకు తిరస్కరించింది. ఈ ఘటనలో పోలీసు ఏఎస్‌ఐ ప్రధాన నిందితుడిగా ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం కొనసాగుతున్న విచారణ పారదర్శకత కోల్పోతుందని భావించింది. నిష్పక్షపాత సంస్థ ప్రత్యక్ష పర్యవేక్షణలో విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూస్తాయని భారతీయ వికాస పరిషత్ సీబీఐ విచారణకు ఆదేశాలు జారీ చేయాలనే అభ్యర్థనతో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి, ప్రజాహిత వ్యాజ్యం(పిల్) దాఖలు చేసింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇది సబబు కాదనే అభిప్రాయంతో హైకోర్టు పిటిషన్‌ను విచారణ తిరస్కరించింది.

ముమ్మరంగా దర్యాప్తు..

మంత్రి నవకిషోర్ దాస్ హత్య సఘటనలో ఏఎస్‌ఐ గోపాల్‌కృష్ణ దాస్ ప్రధాన నిందితుడు. ఈ ఘటన వెనక పూర్వాపరాల నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర క్రైంశాఖ దర్యాప్తు అంచెలంచెలుగా పటిష్టం చేస్తోంది. నిందితుడి వాంగ్మూలంలో నిజానిజాల వాస్తవికతను వెలుగులోకి తెచ్చేందుకు ఉన్నతస్థాయి పరీక్షలు నిర్వహిస్తోంది. నార్కో, పోలిగ్రఫీ టెస్టుల నిర్వహణకు దర్యాప్తు బృందం నడుం బిగించింది. ఈ నేపథ్యంలో క్రైం బ్రాంచ్ ఏడీజీ అరుణ్‌బొత్రా ఆధ్వర్యంలో 8మంది సభ్యుల దర్యాప్తు బృందం నిందితుడిని గుజరాత్ లోని గాంధీనగర్‌కు తరలించారు. విచారణ పటిష్టంగా నిర్వహించేందుకు దర్యాప్తు బృందం దశల వారీగా రిమాండ్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

టీకాల్లేవ్!



భువనేశ్వర్: రాష్ట్రానికి కేంద్రం సరఫరా చేసిన కోవిడ్-19 టీకాల నిల్వలు నిండుకున్నాయి. ఇటీవల కరోనా సంక్రమణ తలెత్తడంతో కేంద్రప్రభుత్వం లక్ష మోతాదుల కోవిడ్ బూస్టర్ డోస్ టీకాలు ఉచితంగా పంపిణీ చేసింది. వీటిలో గురువారం నాటికి నామమాత్రంగా 140 డోసులు మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం. టీకాల నిల్వ నిండుకోవడంతో ప్రజలకు ప్రికాషన్ డోస్ టీకాల ప్రదాన ప్రక్రియ అగమ్యగోచరంగా మారింది. టీకాల పంపిణీ విషయమై కేంద్రప్రభుత్వం నెరు మెదపడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప వ్యవధి టీకా ప్రదానం నిబంధనల కింద సరఫరాపై మొగ్గు చూపడం లేదు. కోవిడ్ సంక్రమణ పెరుగుతున్న నేపథ్యంలో రోగ నిరోధక మోతాదులను(ప్రికాషన్ డోస్) పంపిణీ చేయాలని గత నెలలో రాష్ట్రం కేంద్రాన్ని అభ్యర్థించింది. ఈ మేరకు లక్ష డోసుల కోవిషీల్డ్ టీకాలు రాష్ట్రానికి చేరాయి. రాష్ట్రప్రజలు ప్రికాషన్ డోస్ వ్యాక్సిన్ పట్ల ఆసక్తి చూపడం లేదు. స్వల్ప నిడివిలో టీకాల ప్రదానం ముగించేలనే నిబంధనతో కేంద్రం టీకాలు పంపిణీ చేస్తోంది. ఈ పరిస్థితులు మరింత జఠిలం కాకుండా అనుకూలమైన రీతిలో ఈసారి టీకాల పంపిణీ చేయాలని రాష్ట్రప్రభుత్వం స్పష్టం చేసింది.

దుకాణాలపై బీఎంసీ అధికారుల దాడులు



ఫాస్ట్‌ఫుడ్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న బీఎంసీ కమిషనర్ జెనా, అధికారులు

బరంపురం: నగరంలోని వివిధ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై బరంపురం మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధ, గురువారాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. కమిషనర్ సొనాల్ జెనా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో రైల్వేస్టేషన్ రోడ్డులోని పాంటలూన్స్ షోరూంలో సోదాలు చేశారు. బీఎంసీ డిప్యూటీ కమిషనర్ వినోద్‌కుమార్ బెహరా తెలిపిన వివరాల ప్రకారం... నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మించిన పాంటలూన్స్ షోరూంను పోలీసుల సాయంతో అధికారులు సీజ్ చేశారు. అలాగే సిటీ హైస్కూల్, స్టేడియం, మెయిన్ రోడ్డులో నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ దుకాణాల్లోని ఆహారా పదార్థాల్లో హానికర రసాయన రంగులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వాణిజ్య గ్యాస్ సిలీండర్లకు బదులుగా గృహ వినియోగ సిలీండర్లను వినియోగిస్తున్న దుకాణదారులపై భారీ జరిమాన విధించారు. గిరి మార్కెట్ రోడ్డు, గౌతం సినిమాహాల్, రామలింగేశ్వర్ పార్క్ తదితర ప్రాంతాల్లో పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న దుకాణాలపై రూ.2 వేల చొప్పున అపరాధ రుసుం వసూలు చేశారు.



అధికారులు సీజ్ చేసిన పాంటలూన్స్ షోరూమ్

సమాచార కమిషనర్‌గా సుశాంత్ మహంతి



సుశాంత్ మహంతి

భువనేశ్వర్: రాష్ట్ర సమాచార శాఖ నూతన కమిషనర్‌గా సుశాంత్ మహంతి నియమితులయ్యారు. గవర్నర్ ఆమోదంతో రాష్ట్రప్రభుత్వం ఆయనను సమాచార కమిషనర్‌గా నియమించినట్లు సమాచార, ప్రజా సంబంధాల శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సుశాంత్ స్థానిక దినపత్రిక సమాజ్ కార్యనిర్వాహక సంపాదకులుగా పని చేశారు. ఒడిశా స్పోర్ట్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

'పోరాట యోధుడు దుర్యోధన మహంతి'

జయపురం: కార్మికుల ప్రయోజనాలు, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన యోధుడు దుర్యోధన మహంతి అని కార్మిక సంఘాల నేతలు కొనియాడారు. సోషలిస్టు యూనియన్ ఆఫ్ ఇండియా(కమ్యూనిస్టు) పార్టీ మాజీ కార్యదర్శి, సేవా పేపరుమిల్లు కార్మిక సంఘం సాధారణ కార్యదర్శి దుర్యోధన అకాల మరణం చెందని నేపథ్యంలో కార్మిక నేత కనూ బిశ్వాల్ అధ్యక్షతన సంతాప సభ గురువారం నిర్వహించారు. ఆయన మరణం అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో కార్మిక పోరాటానికి తీరని లేటని విచారం వ్యక్తం చేశారు. మహంతి పోరాట వీరుడని, ఆయన తన జీవితాన్ని కార్మికుల ప్రయోజనాలకే అంకితం చేశారని గుర్తు చేసుకున్నారు. తన జీవితాన్నే కాకుండా తన కుటుంబాన్ని కూడా పోరాట మార్గంలో నడిపించారని తెలిపారు. సేవా పేపరుమిల్లు మూతపడిన సమయంలో ఆయన జరిపిన పోరాటం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహంతి చిత్రపటానికి పూలమాలలు, నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

50 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితుడితో పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా పోలీసు పరిధి 59వ నంబర్ జాతీయ రహదారిలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ బ్రజేష్‌కుమార్ రాయ్ అందించిన సమాచారం ప్రకారం దిగపండి నుంచి 59వ నంబర్ జాతీయ రహదారిలో ఎక్సైజ్ పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. బరంపురం వైపు వస్తున్న ఆటోలో 7బస్తాల్లో ఉన్న 50కిలోల గంజాయిని గుర్తించారు. ఈ మేరకు సరుకుతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు గజపతి జిల్లా అడవా గ్రామానికి చెందిన రాధాకాంత్ సింగ్‌గా తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ టున్నీ హుయిక, పక్కన బీడీఓ సాబొతో, హెప్రుక

రాయగడ: రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ఇప్పటి నుంచే నివారణ చర్యలు చేపట్టాలని రాయగడ సమితి చైర్‌పర్సన్ టున్నీ హుయిక సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక సమితి సమావేశ మందిరంలో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె ప్రసంగించారు. సమితి పరిధిలోని గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే ఆయా ప్రాంత ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ప్రధానంగా తాగు నీటి సమస్యపై తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా సంబంధిత అధికారులు ప్రతి ప్రాంతంలో పర్యటించి, మరమ్మతులకు గురైన గొట్టపు బావులను త్వరితగతిన మరమ్మతు చేయాలని ఆదేశించారు. అనంతరం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రధానమంత్రి అవాస్ యోజన పథకంలో అర్హులైన వారిని గుర్తించి, సకాలంలో వారికి ఇళ్లను కేటాయించాలన్నారు. సమితి పరిధిలో 91 గ్రామాలు బాల్యవివాహ రహిత గ్రామాలుగా గుర్తింపు పొందాయని, భవిష్యత్‌లో మరిన్ని గ్రామాల్లో ఇదే స్ఫూర్తి కొనసాగించేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సమీక్షలో బీడీఓ లక్ష్మీనారాయణ సాబొతో, వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక, జిల్లా పరిషత్ సభ్యురాలు సంధ్యా పులక పంచాయతీ సర్పంచ్‌లు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

వాహన చట్టాలపై అవగాహన



శిబిరంలో మాట్లాడుతున్న సుయన్ జెనా

జయపురం: సడక్ సురక్షా మోటార్ వాహన చట్టాలను అంతా పాటించాలని జిల్లా న్యాయ సేవా ప్రధీకరణ కార్యదర్శి సుమన్ జెనా కోరారు. వాహన చట్టాలపై సబ్ డివిజన్ పరిధిలోని అంబాగుడ గ్రామంలో గురువారం నిర్వహించి అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడారు. సడక్ సురక్షా, మోటార్ ప్రమాదాల ట్రిబ్యునల్, మోటార్ వాహన నియమాలను తెలియజేశారు. వాహనాలకు లైసెన్స్, బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టంచేశారు. అతివేగంగా వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా కుటుంబ సభ్యులకు అండగా నిలవడంతో పాటు తోటివారి ప్రాణాలను కూడా పరిరక్షించవచ్చని వివరించారు. శిబిరంలో న్యాయసేవా ప్రధీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ న్యాయమూర్తి సుమన్ జెనా, మోటార్ వెహికల్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతకుమార్ మహంతి, ప్రభుత్వ న్యాయవాది డాక్టర్ బి.గాయత్రీదేవి, అంబాగుడ సర్పంచ్, పారాలీగల్ వలంటీర్లు రాజా మహంతి, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కల్యాణమస్తు ఆర్థిక సాయం

● డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

పార్వతీపురం టౌన్: వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా కార్యక్రమం ద్వారా నిరు పేద తల్లిదండ్రుల ఖాతాల్లో ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం శుక్రవారం జమ చేస్తుందని పార్వ తీపురం మన్యం డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటీడీఏ గిరిమిత్ర సమావేశం మందిరంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 67 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, భవననిర్మాణ కార్మికుల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.46.60 లక్షలు ఈ మేరకు జమ చేయను న్నట్లు తెలిపారు. నిరుపేద తల్లిదండ్రులకు ఆడపిల్లల పెళ్లిళ్ల భారం కాకూడదనే ఉద్దేశం తో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసిం దని తెలిపారు.

ఆటో, లారీ ఢీ: నలుగురికి గాయాలు



క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలిస్తున్న 108 సిబ్బంది

కొత్తవలస రూరల్: విశాఖ-అరకు రహదా రిలో అప్పన్నపాలెం జిందాల్ కర్మాగారం వద్ద గురువారం ఉదయం లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. డుంబిరిగూడ మండ లానికి చెందిన గల్లోరి అర్జున్ కుటుంబసభ్యు లతో కలిసి ఆటోలో విశాఖపట్నం వెళ్తున్న సమయంలో జిందాల్ కార్మాగారం వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గల్లోరి నీలమ్మ, గల్లోరి రత్నప్రియ, దాసరి బాలన్నకు గాయాలు అవ్వడంతో 108లో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు.

క్షయ నివారణ శాఖ ఉద్యోగికి షోకాజ్

విజయనగరం ఫోర్ట్: జిల్లా క్షయ నివారణశా ఖలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగికి డీటీసీఓ రామేశ్వరి ప్రభ గురువారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. క్షయ నివారణశాఖలో నిధుల ఖర్చుకు సంబంధించి క్యాష్ బుక్ మెయింటైన్ చేయలేదని, గత ఏడాది నవంబ ర్‌లో క్షయ నివారణ శాఖలో టీబీ సీనియర్ సూపర్‌వైజర్, టీబీ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించి విద్యా ర్హత తప్పుగా ప్రకటన ఇచ్చారనే ఆరోపణ లపై ఆ ఉద్యోగికి షోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఈ విషయాన్ని క్షయ నివారణ అధికారి రామేశ్వరి ప్రభ ధ్రువీకరించారు.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ దర్యాప్తు

రాజాం సిటీ: ఇటీవల మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన మెప్మా ఆర్పీ శారద ఆత్మహత్యాయత్నానికి పాల్ప డిన ఘటనలో నమోదైన అట్రాసిటి కేసుపై డీఎస్పీ గురువారం దర్యాప్తు నిర్వహించారు. గ్రామానికి చెందిన శివజ్యోతి గ్రూపు సభ్యుల లోన్ మొత్తాన్ని ఆర్పీ శారద సొంతానికి వాడు కుంది. ఈ విషయమై గ్రూప్ సభ్యులు ఆరా తీసి మెప్మా సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్పీ ఆ నగదును బ్యాంకులో జమచేసినట్లు మెప్మా సిబ్బంది తెలిపారు. అయినప్పటికీ తనను మున్సిపాల్టీలో కొంత మంది మెప్మా సిబ్బంది కులం పేరుతో దూ షించారని మనస్తాపం చెందిన శారద చీమల మందు తాగేసింది. ఈ విషయంపై సంతక విటి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథంలో బాధితురాలిని, శివజ్యోతి సభ్యు లను డీఎస్పీ మోహనరావు విచారణ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫూల్‌బాగ్: డాక్టర్ బీఆర్ అంబే డ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలు కొప్పెర్ల (బాలురు), నెల్లిమర్ల(బాలికలు),వంగర(బా లికలు)లో పార్ట్‌టైం ప్రాతిపదికన హెల్త్ సూప ర్‌వైజర్/స్టాఫ్‌నర్స్‌గా పనిచేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ జిల్లా సమన్వయకర్త బి చం ద్రావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు అర్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, దరఖాస్తుతో పాటు ఆర్‌అం డ్‌బీ సమీపంలో గల తమ కార్యాలయంలో ఈనెల 13లోగా అందజేయాలని పేర్కొ న్నారు.ఇంటర్వ్యూ తేదీని దరఖాస్తులు సమరి ్పంచిన ఫోన్‌నంబర్ ద్వారా నేరుగా అభ్యర్థు లకు తెలియజేస్తామన్నారు. కనీస విద్యార్హ తలు జీఎన్‌ఎం/ బీఎస్సీ నర్సింగ్‌గా నిర్ణయిం చినట్లు స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,900 గౌరవ వేతనం చెల్లిస్తామ ని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసు కోవాలని పిలుపునిచ్చారు.

రెండు కార్లు ఢీ: ముగ్గురికి గాయాలు

పాచిపెంట: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పాచిపెంట మండలంలోని పి.కొనవలస పంచాయతీ శ్యామలగౌరీపురం వద్ద గురువారం ఈ ఘటన జరిగింది. పాచిపెంటనుంచి సాలూరు వస్తున్న ఓ కారు, అదే సమయంలో సాలూరు నుంచి ఒడిశా వెళ్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాలూరు పట్టణానికి చెందిన రాగల హరి బాబు, ఒడిశాకు చెందిన ముఖేష్ మంగి, గట్టి నవీన్‌లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రు లను వెంటనే 108లో సాలూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘట నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట రమణ తెలిపారు.

ఆద్యంతం.. ఆనందం



కార్యక్రమ లక్ష్యాలను వివరిస్తున్న దేవేంద్ర అధికారి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, ప్రజలు

● నందడిగా కొరాపుట్ సమాచార్ ఫేస్‌బుక్ గ్రూప్ ప్రదర్శనలు

జయపురం: అవిభక్త కొరాపుట్ సమాచార్ ఫేస్‌బుక్ గ్రూప్ ఆధ్వర్యంలో జయపురం లోని ఓ ప్రైవేట్ ఫం క్షన్ హాలులో గురువారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆదివాసీ కళాకారుల నృ త్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు సంగీత కార్య క్రమం, మ్యాజిక్ షో ప్రదర్శించారు. ఈ సందర్భం గా ఆదివాసీ సంస్కృతి పరిశోధకులు నవరంగపూర్ దొడ్రవాసి సాయిమండ బిడ్డిక, ఆకాశవాణి తబలా కళాకారులు భరత్ చలాన్, కొరాపుట్ జిల్లా ఆదివాసీ సంస్కృతి ప్రచార, ప్రసారాలు బాధ్యతలు చేపట్టిన రంజన్ మహురియ, ఆదివాసీ, భాష, సంస్కృతి పరి శోధకులు, మల్కన్‌గిరి జిల్లాకు చెందిన డొంబురు శిశా, రాయగడ జిల్లా నుంచి డాక్టర్ ఈశ్వరచంద్ర నాయక్ లను సన్మానించారు. కార్యక్రమంలో ఫేస్‌బుక్ గ్రూప్ ప్రతినిధి దేవేంద్ర అధికారి, రఘు నాథ్ బిశ్వాల్, జయంత పట్నాయక్, గణేష్ బిశాయి, నిహీర్ కర్కర, దేవదాస్ మహంకుడొ, కాశీ చరణ దేవశర్మ, సరిత మిశ్రా తదితరులు పాల్గొని, ప్రసంగించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాల సంస్కృ తి, ఆదివాసీ తెగల సంప్రదాయం, కళలు, నృత్యాల ప్రత్యేకతను తెలియజేశారు.



నృత్యాలతో ఆకట్టుకున్న కొరాపుట్ ఆదివాసీ బృందం



బోండా గిరిజన మహిళల నృత్యాలు

శ్రామికుల హక్కులను హరిస్తున్న కేంద్రం



బిజయకుమార్ జెనాకు స్వాగతం పలుకుతున్న నాయకులు



సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ, ప్రజాసంఘాల ప్రతినిధులు

● రాష్ట్ర ఏఐటీయూసీ సాధారణ కార్యదర్శి బిజయకుమార్ జెనా విమర్శలు

జయపురం: దేశంలో కార్మికులు, శ్రామికుల హక్కులు, అధికారాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని రాష్ట్ర ఏఐటీయూసీ సాధా రణ కార్యదర్శి బిజయకుమార్ జెనా ధ్వజమెత్తారు. స్థానిక శ్రామిక భవనంలో కొరాపుట్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్మిక సం ఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధా నిగా నరేంద్రమోదీ పగ్గాలు చేపట్టిన తరువాత పెద్ద నోట్ల రద్దు, తప్పుడు జీఎస్‌టీ విధానాలు దేశ ఆర్థిక పరిస్థితిని కుంగదీశాయని ఆరోపించారు. కరోనా మహమ్మారితో దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయని, అసంఘటిత రం గాల్లో కార్మికుల తొలగింపు పెరిగిందని విమర్శిం చారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటర్లకు అప్పగిస్తూ కార్మిక ప్రయోజనాలను కాల రాస్తు న్నారని మండిపడ్డారు. కార్మికనేత ప్రమోద్‌కుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాయగడ, కొరాపుట్, మల్కనగిరి, నవరంగపూర్ జిల్లాలకు చెందిన కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే ప్రముఖ కార్మికనేత దుర్యో ధన మహంతి అకాల మృతికి సంతాపం ప్రకటిం చారు. అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో ఉద్యమాలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు

కమిటీ ఏర్పాటు..

ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నప్పటికీ అంగ న్వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం వంట సహాయకుల జీతాలు పెంచడం లేదని బిజ యకుమార్ జెనావిమర్శించారు. ఉద్యోగులను నియ మించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేద న్నారు. దేశంలో విమానాశ్రయాలు, బ్యాంక్‌లు, బీమా సంస్థలు, పరిశ్రమలను ప్రైవేటీకరణ పేరుతో అంబానీ, అదానీ లకు దోచి పెడుతున్నారని ఆరో పించారు. జయపురం లోని గగణాపూర్ సేవా పేపరుమిల్లులో ఉద్యోగులు, కార్మికులకు సగం జీతం మాత్రమే ఇస్తున్నారని దుయ్యబట్టారు. విశ్రాంత ఉద్యోగుల పెన్షన్, వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీ యూసీ ప్రతినిధులు రామకృష్ణ దాస్, జుధిష్ఠర్ రౌళో మాట్లాడుతూ సంఘన్ని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దీనికి అనుగుణంగా 19మందితో కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఉత్తమ మల్లిక్, కల్యాణి సాహు, బలరాం కులసియ, దుర్గాప్రసాద్, శివానీ దుర్గ, సుకు జాని, త్రిపతి మాఝి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోండి



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న కళాకారులు

● ప్రభుత్వానికి ప్రాచీన కళలు, సంస్కృతి పరిషత్ ప్రతినిధులు వినతి

రాయగడ: కళారంగాన్ని నమ్ముకుని, జీననోపాధి పొందుతున్న కళాకారులు పరిస్థితి అత్యంత దయనీ యంగా మారిందని, ఈ నేపథ్యంలో కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర ప్రాచీన కళలు, సం స్కృతి పరిషత్ రాయగడ శాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ్ ప్రధాన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రముఖ కళాకారుడు బొత్స సంతోష్‌కుమార్ నేతృ త్వంలో పట్టణంలోని ప్రజాపనుల శాఖ బంగ్లా నుం చి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని విన్నవించారు. కళలనే నమ్ముకొని ఉన్న ఎంతోమంది జీవితాలు ఆర్థిక, సామాజిక రంగాల్లో అత్యంత దుర్భరంగా మారారని వాపోయారు.



ఏడీఎం ప్రధాన్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రభుత్వం స్పందించి, కళాకారులకు ప్రతినెలా రూ.3 వేల చొప్పున్న భృతి మంజూరు చేయాలని పేర్కొన్నారు. అలాగా ప్రమాదావశాతు మృతిచెం దిన కళాకారుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహకారాన్ని అందించాలన్నారు. బాధిత కుటుంబా లకు చెందిన పిల్లలకు ఉచితంగా విద్య, వైద్య సదు పాయం కల్పించాలని విన్నవించారు. సంఘం కార్యదర్శి టోని అగర్‌వాల్, సభ్యులు పాల్గొన్నారు.

బాబానగర్‌లో వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సంఘమిత్ర దొళాయి



చికిత్స చేయించుకుంటున్న ఎస్పీ సరవణ్ వివేక్

బరంపురం: నగరంలోని బాబానగర్ మెయిన్ రోడ్డులో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ఎంకేసీజీ మెడి కల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కేఎం పాత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వ హించారు. బరంపురం మేయర్ సంఘమిత్ర దొళాయి ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించగా, బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మేయర్, ఎస్పీ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో 50మంది నగర వాసులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించడంతో పాటు పలు సూచనలు తెలియజేశారు.

గుణుపూర్‌లో రోడ్డు విస్తరణకు చర్యలు



గుణుపూర్ బైపాస్ రోడ్డు

● రూ.14 కోట్ల నిధులు కేటాయించిన రాష్ట్రప్రభుత్వం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రజా పనుల శాఖ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న బైపాస్ రోడ్డును అనుసంధానం చేస్తూ అదనంగా మరికొన్ని రహదారుల నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించింది. దీనికి గాను రూ.14 కోట్ల నిధు లను రాష్ట్రప్రభుత్వం కేటాయించింది. నిర్మాణ పను లకు సంబంధించి ఇప్పటికీ టెండర్లను ఆహ్వానిం చినట్లు అధికారులు తెలిపారు. బైపాస్ రోడ్డులో క్రమంగా రద్దీ పెరగడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రధానంగా బైపాస్ రోడ్డు నుంచి బలరాంనగర్‌కు వెళ్లేందుకు 2 కిలోమీటర్ల దూరాన్ని చేరుకునేందుకు దాదాపు 20 నిమిషాల సమయం పడుతోంది. దీనివల్ల కార్యాల యాలు, పాఠశాలలకు వెళ్లే వారు సకాలంలో చేరు కోలేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అద నంగా బైపాస్ రోడ్డును అనుసంధానించి, మరో 4రహదారులను నిర్మించేందుకు ప్రజాపనుల శాఖ చర్యలు చేపడుతోంది. దీనికి సంబంధించి మార్గం మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను మార్చేందుకు పనులు ముమ్మరంగా కొనసా గుతున్నాయి. అలాగే వంశధార నదిపై ఉన్న వంతెన మరమ్మతులకు మరో రూ.60 లక్షలు కేటాయిం చినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో త్వరలో గుణుపూర్ రూపురేఖలు మారే అవకాశాలు మెం డుగా కనిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదాలను నివా రిద్దాం..మనతో పాటు మన కుటుంబాలను రక్షించు కుందామంటూ జిల్లా పోలీస్ శాఖ విస్తృతంగా అవ గాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటివ రకూ చేపట్టిన కార్యక్రమాలను మరింత సమర్థవం తంగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన కూడళ్లు, జంక్షన్‌ల వద్ద ఈ మేరకు నిఘా పెంచింది. దొంగతనాలు, దోపిడీలతో పాటు రోడ్డు ప్రమాదాల బారి నుంచి వాహనచోదకులను కాపాడేందుకు కృషిచేస్తోంది. మద్యం మత్తులో వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేయడం వంటి చర్యలకు అడ్డుకట్ట వేస్తోంది. నిబంధనలు అతిక్రమించి వాహ నాలు నడిపిన వారిపైన కేసులు నమోదుచేసింది. గతేడాది సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసిన వారిపై 4,823 కేసులు, మైనర్ డ్రైవింగ్ కేసులు 1,223, ట్రిపుల్ రైడింగ్ 20, 272 కేసులు, మోటారు వాహనాల చట్టం అతిక్రమించిన 2 లక్షల 22 వేల 962 మం దిపై కేసులు నమోదుచేసింది. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడిపిన 5,500 మందిపై కేసులు నమోదుచేశారు. జిల్లా వ్యాప్తంగా 42కి పైగా బ్లాక్ స్పాట్స్‌ను పోలీసులు గుర్తించి ప్రమాదాలు జర గకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పగటి వేళతో పాటు రాత్రివేళల్లో కూడా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటుచేసింది. ఫేస్‌వాష్ పేరుతో పలు స్టేషన్‌ల పరిధిలో ఉన్న హైవేలపై వచ్చే లారీలను నిలిపి డ్రైవర్లతో ముఖం కడిగించి వారి పరిస్థితి బాగుందన్న తర్వాతనే లారీలను పం పిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో కీలకమైన సెంటర్‌తో పాటు శివారు ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని అడ్డుకుని కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడితే నేరుగా జైలుకు పంపిస్తు న్నారు.



రాత్రివేళ ప్రధాన కూడళ్లలో డ్రంకన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న పోలీసులు

మద్యం మహమ్మారితో నష్టాలపై అవగాహన

ప్రతి పోలీసు అధికారి పగటి పూట ఆయా ప్రధాన జంక్షన్‌లలో మద్యం మహమ్మారి వల్ల వచ్చే నష్టా లను వివరిస్తూ, ఇంకెప్పుడూ మద్యం తాగి వాహనం నడపబోమని ఆటోడ్రైవర్లు, యువత, పెద్దలు వాహనచోదకులతో ప్రమాణాలు చేయిస్తు న్నారు. వారితో ప్రత్యేకంగా రూపొందించిన కరప త్రాలను చదివించి, అనంతరం సంతకాలు సేకరి స్తున్నారు.



రోడ్డు భద్రత అవగాహనలో హెల్మెట్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కుటుంబాలు ఛిన్నాభిన్నమైపోతున్నాయి



మద్యం తాగి వాహనాలు నడిపే వారి వల్ల ఆ వ్యక్తు లతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలకు సంబం ధించిన వారి కుటుంబాలు కూడా ఛిన్నాభిన్నమై పోతున్నాయి. జిల్లాలో రోడ్డు ప్రమాదాల సం ఖ్యను తగ్గించేందుకు చర్యలు వేగవంతం చేస్తు న్నాం. ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీవ్రంగా ఉంటాయి.

– ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

చెరువులో.. దుర్‌'మార్గం'



కటకం చెరువు గర్భం ఆక్రమించి నిర్మించిన రహదారి

జామి: మండలకేంద్రం జామి మాధవరాయి మెట్ట వద్ద ఉన్న కటకం చెరువులో అక్రమంగా రహదారి నిర్మాణం చేపడుతున్నారని స్థానిక రైతులు తహసీ ల్దార్‌కు ఫిర్యాదు చేశారు. జిరాయితీ, చెరువు, ప్రభుత్వ స్థలంలో దౌర్జన్యంగా రహదారి నిర్మాణం చేపట్టారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తూ చెరువు ఆయకట్టు కింద సుమారు 80 ఎకరాలు సాగు చేస్తున్నామని రైతులు వాపోయారు. ఫిర్యాదు మేరకు మండల సర్వేయర్ ఖాదర్, వీఆర్వో శ్రీను ఆక్రమణకు గురైన స్థలాన్ని గురువారం సర్వే చేశారు. అనంతరం తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి మాట్లాడుతూ మొత్తం 34 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారిం చామని తెలిపారు. సర్వే నంబర్ 456లో 34 సెంట్లు, అదికాక ప్రైవేట్ స్థలం కొంత మేరలో రహదారి నిర్మాణం చేసినట్లు చెప్పారు. ఎటువంటి అను మతులు లేకుండా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రహదారి నిర్మాణం చేపట్టడం చట్ట రీత్యా నేరమ న్నారు. స్థలంలో ఉన్న జేసీబీని సీజ్ చేసి ఘటనా స్థలంలో పనులు నిర్వహిస్తున్న స్థానికులు ఇద్దరిపై కేసులు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



రహదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్



సర్వే చేస్తున్న సర్వేయర్ ఖాదర్

న్యూస్‌రీల్

అకౌంట్ సెక్షన్ అధికారి కార్యాలయం ప్రారంభం


అకౌంట్స్ కార్యాలయం ప్రారంభిస్తున్న డైరెక్టర్ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో అన్ని విభాగాలను బలోపేతం చేస్తున్నామని క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో అకౌంట్ సెక్షన్ అధికారి కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. అన్ని విభాగాలకు ప్ర త్యేక కార్యలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అకడమిక్, పరిపాలన విభాగాలు సమర్థంగా పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, అకౌంట్స్ అధికారి కె.మోహన్‌రావు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో విజిలెన్స్ ఎస్పీ

జలుమూరు: శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని గురువారం విజిలెన్స్ (ట్రాన్స్‌కో) ఎస్పీ ప్రసన్నకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి ఆలయ చరిత్ర, గోలెం కథ వివరించి స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించి పుణ్యాహవచనాలతో దీవించారు. వీరితోపాటు స్థానిక ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది ఉన్నారు.


స్వామి ఆలయ ప్రాంగణంలో ఎస్పీ ప్రసన్న కుమార్

జనన మరణాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జనన, మరణాల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా జరగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆయన గురువారం న్యాయ సేవా సదన్‌లో ఎంఏఆర్ లా కాలేజీ విద్యార్థులు, పలు ప్రభుత్వ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. న్యాయ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జననం, మరణం, వివాహం ధ్రువీకరణ పత్రాల తర్వాతి కాలంలో వారసులకు ఎంతగానో ఉపయోగపడతాయని, న్యాయవాదులు వీటిపై దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ జనన మరణ సర్టిఫికెట్లు, మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ పొందాలంటే పౌరులు ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు.

పటిష్టంగా ఆహార భద్రత చట్టం అమలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పథకాల అమలులో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు పిలుపునిచ్చారు. ఆయన గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం, జిల్లాలో ఆహార భద్రత చట్టం అమలుపై సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్ ఇక్కడే ఆహార కమిషన్ ఏర్పాటు చేశారని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో విద్యార్థులకు ఫోర్టిఫైడ్ రైస్ అందిస్తున్నట్లు వివరించారు. అధికారులంతా వ్యవస్థలో మార్పు కోసం కృషి చేయాలన్నారు. డీఎస్ఓ వెంకటరమణ మాట్లాడుతూ ఎఫ్‌పీ షాపులు, తదితర వాటిపై వివరించారు. అనంతరం కలెక్టరేట్ బయట ఆయన మీడియాతో మాట్లాడారు. ముమ్మరంగా తనిఖీలు చేసి, అవినీతి లేకుండా, పారదర్శకంగా లబ్ధిదారులకు సరుకులు అందేలా చూస్తామన్నారు. పిల్లల భోజనాలు, వారికి అందించే మెనూ విషయంలో మంచి ఆహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం ఆయన శ్రీకాకుళంలో పలు చోట్ల జరుగుతున్న బియ్యం పంపిణీని పరిశీలించారు. వాంబే కాలనీలో, దండివీధిలోని అంగన్‌వాడీ కేంద్రం ఇతర ప్రాంతాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. టీపీఎం పురపాలక పాఠశాలలో విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనం చేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

శ్రీకాకుళం రూరల్: పెదపాడు పరిధిలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు జాతీయ అంధత్వ, దృష్టి లోపం నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం సింగుపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాలమిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ 650 మంది విద్యార్థుల కళ్లను పరీక్షించి 140 మందికి ఉచిత కళ్లద్దాలు అవసరమని సిఫారసు చేశారు.

పరిగెడుతోంది చూడు.. భావనపాడు


పోర్టు నిర్మాణంలో భాగంగా ముందస్తుగా మారీటైం బోర్డు పర్యవేక్షణలో జియాలజికల్ సర్వేలు చేస్తున్న సిబ్బంది



- భావనపాడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి వడివడిగా అడుగులు
- మార్చిలో శంకుస్థాపనకు చర్యలు
- జోరుగా పరిహారాల పంపిణీ
- నిర్వాసిత కాలనీ ఏర్పాటుకు రూ.55 కోట్లు కేటాయింపు
- పోర్టు నిర్మాణం పూర్తయితే సిక్కోలుకు మంచి రోజులు

దాదాపు నాలుగు దశాబ్దాల కిందట.. శ్రీకాకుళం, వెనుకబాటు కవల పదాలుగా ఉన్న కాలం. మత్స్యకారులు దేశం వెళ్లడం అలవాటు చేసుకుంటున్న రోజులవి. అలాంటి సమయంలో సంతబొమ్మాళి మండలంలో పోర్టు కడతామన్నారు. నిధులు కూడా కేటాయించారు. హమ్మయ్య మా బతుకులు బాగు పడతాయి.. అని గంగపుత్రులు ఆనందించేలోపు ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. అప్పటి నుంచి ఎదురుచూపులతో పాటు వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. వలస పక్షుల్లో చాలా మంది ఇల్లు చేరకుండానే కడతేరిపోయారు. వారితో పాటు పోర్టు ఆశలూ అడుగంటిపోయాయి. ఇదిగో మళ్లీ ఇన్నాళ్లకు వైఎస్ జగన్ సర్కారు ఆ ఆశలకు ఊపిరి పోసింది. పాదయాత్రలో ఈ పోర్టు గురించి వివరాలు తెలుసుకున్న వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. పనులు ఒక్కొక్కటిగా మొదలుపెట్టారు. పరిహారాల పంపిణీ, భూ కేటాయింపులు, టెండర్ల ప్రక్రియ అంటూ ఒక్కో దశను దాటుకుంటూ ముందుకెళ్తున్నారు. ఆయన చొరవతో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు వేగంగా నిర్మితమైతే సిక్కోలు తీరానికి వలసల భారం తగ్గుతుంది.



టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇన్నాళ్లూ ఎన్నికల హామీగా మిగిలిపోయిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి పనులు కళ్ల ముందే జరుగుతుండడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అవరోధాలన్నీ దాటుకుంటూ పోర్టు నిర్మాణం వేగం పుంజుకుంటోంది. ఇందులో భాగంగానే పోర్టు నిర్మాణానికి సంబంధించి 300 ఎకరాలను సిద్ధం చేసి ఏపీ మారీటైం బోర్డుకు అధికారులు అప్పగించారు. ఈసీ క్లియరెన్స్ వచ్చీ రాగానే.. మార్చిలో శంకుస్థాపన చేసేందుకు అంతా సిద్ధం చేశారు. పోర్టు నిర్మాణంలో కీలకమైన జియాలజికల్ సర్వేలను మూలపేట సముద్ర తీరంలో ఆరంభించారు. ఏపీ మారీటైమ్ బోర్డు ఆధ్వర్యంలో విశ్వసముద్ర కంపెనీకు చెందిన సిబ్బంది ఈ తీరంలో జియాలజికల్ సర్వేలను చేస్తున్నారు.

ఈ నాటిది కాదు..

సంతబొమ్మాళి మండలంలో పోర్టు నిర్మాణ ప్రతిపాదన ఈనాటిది కాదు. ఇక్కడ ఓడరేవు నిర్మించాలని 1982లో అప్పటి గవర్నర్ కుముద్‌బెన్ జోషి సుమారు రూ.200 కోట్ల నిధులు కేటాయించారు. నెదర్లాండ్‌కు చెందిన ఓ ప్రైవేట్ సంస్థ పనులకు కూడా సిద్ధమైంది. కానీ పొలారిష్టాలు దాటలేక పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి ఈ పోర్టు నిర్మాణం రాజకీయ నాయకుల హామీల్లో తప్ప పనుల్లో కనిపించలేదు. దశాబ్దాలకు దశాబ్దాలు గడిచిపోయినా.. పనులు ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదు. చాలా కాలానికి ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇక్కడకు వచ్చి స్థానికుల నుంచి ఈ సంగతులు తెలుసుకుని పోర్టు నిర్మాణానికి హామీ ఇచ్చారు. చెప్పారంటే.. చేస్తారంతే అన్న గుర్తింపు తెచ్చుకున్న మహానేత తనయుడు అధికారంలోకి రాగానే పోర్టు పనులు మొదలుపెట్టారు. మొదటి ఫేజ్‌లో సుమారు రూ.3669.95 కోట్లతో సంతబొమ్మాళి మండలం మూలపేట ప్రాంతంలో 409.77 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారు.


నిర్వాసిత కాలనీ కోసం నౌపడ సమీపంలో గుర్తించి న భూమిని పరిశీలిస్తున్న దృశ్యం



పోర్టు నిర్మాణం జరగనున్న ప్రదేశం

రహదారి, రైల్వే మార్గానికి లైన్ క్లియర్

గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ ప్రాంతంతో పాటు మరో వైపు రహదారులు, రైల్వే మార్గానికి అధికారులు చర్యలు చేపట్టారు. టెక్కలి జాతీయ రహదారి నుంచి మోదుగువలస, బన్నువాడ, తలగాం, వేములవాడ, పాతనౌపడ, సంతబొమ్మాళి మండలం రాజపురం, ఇజ్జువరం, కస్పానౌపడ మీదుగా మూలపేట ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు వరకు సుమారు 327.75 ఎకరాలు గుర్తించి సిద్ధం చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే డీడీ పబ్లికేషన్ చేపట్టారు. మరి కొద్ది రోజుల్లో భూముల విలువ కట్టనున్నారు. మరో వైపు సంతబొమ్మాళి మండలం కోటపాడు, కాశీపురం, పోతునాయుడుపేట, యామాలపేట, కూర్మనాథపురం, రాజపురం మీదుగా రైల్వే మార్గానికి 428.02 ఎకరాలు గుర్తించారు.

కీలక నిర్మాణం..

తూర్పు తీరంలో ఉత్తరాంధ్రకు ఆనుకుని ప్రస్తుతం విశాఖ పోర్టు ఒక్కటి మాత్రమే జల మార్గంలో వ్యాపార లావాదేవీలకు అనుకూలంగా ఉంది. జిల్లాలో ఒక పోర్టు ఏర్పాటైతే తీరానికి ఆనుకుని, దగ్గరలో ఉన్న రాష్ట్రాలకు జల రవాణా సులువు, దగ్గర అవుతుంది. ముఖ్యంగా ఉక్కు తయారీ కంపెనీలకు కావాల్సిన బొగ్గు, ముడి ఇనుము ఎగుమతి, దిగుమతులకు భావనపాడు ఓడరేవు అనుకూలంగా మారుతుంది. టెక్కలి ప్రాంతంలోని ప్రఖ్యాత నీలి గ్రానైట్‌ను, పలాస జీడిని ఈజీగా రవాణా చేయవచ్చు. ఆక్వా ఎగుమతులకు ఈ పోర్టు మంచి సపోర్టు ఇస్తుంది. పోర్టు నిర్మాణంతో టెక్కలితో పాటు జిల్లా స్వరూపం కూడా మారుతుంది. కొత్త పనులు, కొత్త ఉద్యోగాలు, కొత్త నిర్మాణాలతో కళ వస్తుంది. తద్వారా వలసలు ఆగుతాయి.

క్షేత్రస్థాయి పనులు పూర్తి..

పోర్టు నిర్మాణం ఆషామాషీ వ్యవహారం కాదు. అందులోనూ రాజకీయ రాబందులు వేధింపులు కూడా తోడయ్యాయి. అయినా అధికారులు ఒక్కొక్కటిగా పనులు పూర్తి చేస్తూ ముందుకు కదులుతున్నారు.

- మొత్తం 594 పీడీఎఫ్‌లు, 383 కుటుంబాలు, 438 స్ట్రక్చర్స్‌గా గుర్తించారు. ఇందులో భాగంగానే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం రూ.148 కోట్లు కేటాయించారు.
- అంతే కాకుండా మూలపేట, విష్ణుచక్రం గ్రామాల నిర్వాసితులకు నౌపడ సమీపంలో నిర్వాసిత కాలనీ కోసం భూమి కొనుగోలుకు రూ.14.30 కోట్లు వెచ్చించారు. 55 ఎకరాల్లో చేపట్టనున్న నిర్వాసిత కాలనీల్లో అన్ని రకాల నిర్మాణాలకు రూ.55 కోట్లు కేటాయించారు.
- పరిహారం విషయంలో జిల్లాలో ఎక్కడా లేని విధంగా మొదటి విడతగా 104 ఎకరాలకు సంబంధించి 175 మంది రైతులకు రూ.26 కోట్లు అందించారు.
- ఇప్పుడు రెండో విడతగా 133.74 ఎకరాలకు సంబంధించి 153 మంది రైతులకు రూ.33.75 కోట్లు చెల్లించేందుకు అంతా సిద్ధం చేశారు.
- ప్రతిపక్ష నాయకులు ఎంతగా రచ్చ చేయాలని చూసినా నిర్వాసిత గ్రామాల వారు మాత్రం ఊరి బాగు కోసం కట్టుబడడంతో విపక్షాల కుట్రలు పనిచేయలేదు.

సీఎం మేలు మరువలేము



సంతబొమ్మాళి మండలానికి పోర్టు కేటాయించి సీఎం వైఎస్ జగన్ జిల్లాకు చేసిన మేలు మర్చిపోలేం. పోర్టు నిర్మాణం పూర్తయితే జిల్లా అభివృద్ధి బాటలో పయనిస్తుంది. మా ప్రాంతంలో నిరుద్యోగ సమస్య తీరుతుంది. టెక్కలి పరిసర ప్రాంతాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయి. మా జిల్లాపై ఎంతో మమకారం చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను చిరకాలం గుర్తుంచుకుంటాం. – దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ

జిల్లా స్వరూపం మారుతుంది..



జిల్లాలో మారుమూల ప్రాంతమైన మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణంతో జిల్లా స్వరూపమే మారిపోతుంది. ఒకప్పుడు వలసల జిల్లా అనే పేరు ఉండేది. ఇప్పుడు అభివృద్ధి పథంలో జిల్లా అని పేరు వచ్చే సమయం ఆసన్నమైంది. పోర్టు నిర్మాణానికి సంబంధించి క్షేత్ర స్థాయిలో అన్ని రకాల పనులు పూర్తయ్యాయి. మారీటైం బోర్డు నేతృత్వంలో శంకుస్థాపన కోసం పనులు వేగవంతం చేస్తున్నారు. –కాయల వెంకటరెడ్డి, మారీటైం బోర్డు చైర్మన్.

అంతా సహకరించారు..



పోర్టు నిర్మాణం వల్ల భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో జరిగే అభివృద్ధి గురించి నిర్వాసిత ప్రాంతాల ప్రజలు అర్థం చేసుకున్నారు. పోర్టు నిర్మాణంలో కీలకమైన భూసేకరణ, పరిహారం పంపిణీ విషయంలో నిర్వాసిత ప్రాంతాల ప్రజలు ఎంతో సహకరించారు. మార్చిలో శంకు స్థాపన కోసం చర్యలు చేపడుతున్నాం. పోర్టు నిర్మాణం వల్ల ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. అన్ని వర్గాల వారికి జీవనోపాధి అందుతుంది. ముఖ్యంగా నిరుద్యోగ సమస్య ఉండదు – టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్, టెక్కలి

కలాసీ దారుణ హత్య

- కంఠం కోసి చంపేసిన దుండగులు
- ఆధారాలు దొరక్కుండా పథకం ప్రకారం మర్డర్


పోలీసు జాగిలాలతో తనిఖీలు చేస్తున్న పోలీసులు


హత్యకు గురైన మట్ట గవరయ్య

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం లఖందిడ్డి పంచాయతీ మూలపేట గ్రామానికి చెందిన మట్ట గవరయ్య(అడివయ్య)(35)ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గవరయ్య కోటబొమ్మాళిలోని ఓ రైస్‌మిల్లులో కలాసీగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగానే బుధవారం ఉదయం ఆయన తన టీవీఎస్ బండిపై మిల్లుకు వెళ్లాడు. అయితే సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో అతని కుమారుడు రాత్రి 7 గంటల సమయంలో గవరయ్యకు ఫోన్ చేసి ఇంటికి సరుకులు తీసుకురావాలని చెప్పగా.. తాను కోటబొమ్మాళి బజారులో ఉన్నానని, సరుకులు తీసుకువస్తానని చెప్పాడు. అయితే రాత్రి 9 గంటలైనా అతను ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు కంగారు పడి ఫోన్ చేస్తే బిజీ అని వచ్చింది. ఎంతగా కాల్ చేసినా లైను కలవకపోవడంతో ఎటో వెళ్లి ఉంటాడు.. ఏదో ఒక సమయానికి వస్తాడని కుటుంబ సభ్యులు ఊరుకున్నారు. అయితే గురువారం వేకువజామున గవరయ్య కుటుంబ సభ్యులకు ఒక ఫోన్ కాల్ వచ్చింది. బంజరుపేట లఖందిడ్డి గ్రామాల మధ్య కంకరరోడ్డు పై కల్వర్టు వద్ద గవరయ్యను ఎవరో హత్య చేసి పడేశారని చెప్పడంతో కుటుంబ సభ్యులంతా నిశ్చేష్టులైపోయారు. పోలీసులకు కూ డా సమాచారం అందడంతో టెక్కలి సీఐ సూర్యచంద్ర మౌళి, కోటబొమ్మాళి ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ, టెక్కలి ఎస్ఐ రామకృష్ణ, సంతబొమ్మాళి ఎస్ఐ మధుసూదనరావు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గవరయ్య కంఠం కోసి, తలపై నరికి దారుణంగా హత్య చేసినట్లు గుర్తించారు. పోలీసులు జాగిలాలు, క్లూస్ టీమ్‌ను రప్పించి ద ర్యాప్తు మొదలుపెట్టారు. మృతుడి కాల్ డేటా కూడా పరిశీలిస్తున్నారు. మృతునికి తల్లి తో పాటు భార్య శ్రీదేవి, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. తల్లి ఇ చ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశా రు. మృతదేహాన్ని కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రాష్ట్ర స్విమ్మింగ్ పోటీలకు సిరిపురం విద్యార్థి

సంతకవిటి: ఈనెల 11 నుంచి 13 వరకూ కృష్ణాజిల్లా కంకిపాడులో జరగనున్న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు సంతకవిటి మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.తేజేశ్వరరావు ఎంపికయ్యాడు. అండర్-17 విభాగంలో జిల్లా తరపున ఈ విద్యార్థి పోటీల్లో పాల్గొంటాడని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.సన్నిబాబు తెలిపారు. గురువారం ఈ విద్యార్థిని పంచాయతీ సర్పంచ్ డోల తిరుపతి, పాఠశాల హెచ్ఎం వజ్జ వెంకటరావు, విద్యా కమిటీ చైర్మన్ రఘేంద్ర, గ్రామస్తులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక


జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

తెర్లాం: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల ఏలూరు జిల్లా పెదవేగిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలురు, బాలికల జట్లు విశేష ప్రతిభ కనబరిచాయి. ఆయా జట్లలో పాల్గొన్న క్రీడాకారుల్లో ఏడుగురిని జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. జాయతీస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై న వారిలో బొబ్బిలి మండలం పారాది హైస్కూల్‌కు చెందిన జి.నానిబాబు, కె.రోహిత్, ఎస్.జయశ్రీ, తెర్లాం హైస్కూల్ నుంచి ఎం.శేఖర్, కె.ఉదయ్‌కిరణ్, ఇ.మీనా, ఉల్లిభద్ర హైస్కూల్‌కు చెందిన పి.హైమ ఉన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఫిజికల్ డైరక్టర్లు సీహెచ్.సత్యనారాయణ, జి.బంగారునాయుడు, శ్రీనివాసరావు అభినందించారు.

శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష


మాట్లాడుతున్న ఆర్‌డీఓ శాంతి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఈ నెల 18 నుంచి 20 వరకూ జరగనున్న శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని శ్రీకాకుళం ఆర్‌డీఓ బొడ్డేపల్లి శాంతి అన్నారు. ఆమె గురువారం శ్రీముఖలింగంలో పలు శాఖల అధికారులు, అర్చకులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణలో ప్రజాప్రతినిధులు, పాలక మండలిని భాగస్వాములు చేయాలన్నారు. చక్రతీర్థ స్నానాలకు పటిష్ఠం ఏర్పాట్లు చేయాలని సూచించారు. మొదటి, ఆఖరి రోజున శ్రీముఖలింగంకు భక్తుల తాడికి ఎక్కువగా ఉంటుందని, ఆ మేరకు ఆర్టీసీ సర్వీసులు నడపాలన్నారు. సమావేశంలో డీఎస్పీ శివరామిరెడ్డి, తహసీల్దార్ బి.సత్యం, పాలక మండలి చైర్మన్ పంచిరెడ్డి లింగమూర్తి, సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ కె.హరి ప్రసాద్, పాలక మండలి ఉపాధ్యక్షుడు లాడి రమేష్ గుప్తా, ఈఓ ప్రభాకరరావు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మెండ రాంబాబు, ఎంపీడీఓ జీవీ రవి కుమార్, సీఐ రాము తోపాటు వైద్యాధికారులు శ్రీకాంత్, అప్పారావు, గురునాథరావు, ఎస్ఐలు పారినాయుడు, కృష్ణ ప్రసాద్, అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు హెపటైటిస్–బి వ్యాక్సిన్

పార్వతీపురంటౌన్: హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులందరికీ హెపటైటిస్ – బి వ్యాక్సిన్ అందేలా చర్యలు చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అదనపు పథక సంచాలకుడు డాక్టర్ వై.కామేశ్వర ప్రసాద్ ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో జరుగుతున్న హెచ్ఐవీ సర్వే విధానాన్ని పరిశీలించేందుకు రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ పి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో గల హెచ్ఐవీ సర్వే సెంటర్‌ను తనిఖీ చేసి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో నిర్వహిస్తున్న హెపటైటిస్–బి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి ఏఆర్‌టీ సెంటర్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

మోగింది.. ఉత్తరాంధ్ర నగారా



- 16న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- ఈ నెల 9 నుంచి ఉత్తరాంధ్రలో అమల్లోకి ఎన్నికల కోడ్
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- ఉత్తరాంధ్రలో 2,82,348 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- 338 పోలింగ్ స్టేషన్లు, 694 బ్యాలెట్ బాక్సులు
- 6 జిల్లాల్లో 1,860 మంది పోలింగ్ అధికారులు


రాష్ట్ర ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల నగారా మోగింది. శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల షెడ్యూల్‌ను ఎలక్షన్ కమిషన్ గురువారం విడుదల చేసింది. ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. మార్చి 13న ఎన్నికలు నిర్వహించి 16వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. షెడ్యూల్ విడుదలతో పట్టభద్రుల ఎన్నికల వేడి ఉత్తరాంధ్రలో రాజుకుంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ను ప్రకటించగా.. బీజేపీ, పీడీఎఫ్‌లు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. మరోవైపు టీడీపీ చివరి నిమిషంలో అభ్యర్థిని మార్చడంతో నేతల్లోనే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు షెడ్యూల్ విడుదల కావడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ నెల 9 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున ప్రకటించారు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్, అడిషనల్ రిటర్నింగ్ అధికారులుగా ఆయా జిల్లాల డీఆర్‌వోలు వ్యవహరించనున్నారు.

రాజుకున్న రాజకీయ వేడి

ఈసారి రాజకీయపక్షాలు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలపై ముందుగానే ఎన్నికలపై దృష్టిసారించాయి. అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ని ప్రకటించగా.. ఆయన ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక బీజేపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ మాధవ్ కొనసాగుతున్నారు. పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థిగా డా.కోరెడ్ల రమాప్రభని ఎంపిక చేశారు. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ మాత్రం చిన్నికుమారి లక్ష్మిని పక్కన పెట్టి డా. చిరంజీవిరావు తమ ఎమ్మెల్సీ అభ్యర్థి అంటూ తెరపైకి తీసుకొచ్చింది. ఈ విషయం ఉత్తరాంధ్ర టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మింగుడుపడటం లేదు.

నోటిఫికేషన్ వివరాలివీ..

షెడ్యూల్ విడుదల	:	ఫిబ్రవరి 16
నామినేషన్ల స్వీకరణ ప్రారంభం	:	ఫిబ్రవరి 16
నామినేషన్ల ముగింపు	:	ఫిబ్రవరి 23
నామినేషన్ల పరిశీలన	:	ఫిబ్రవరి 24
నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ	:	ఫిబ్రవరి 27
పోలింగ్	:	మార్చి 13
కౌంటింగ్	:	మార్చి 16
ఎన్నికల ప్రక్రియ ముగిసే తేదీ	:	మార్చి 21

నాడు 1.70 లక్షలు.. నేడు 2.82 లక్షల ఓటర్లు

2017లో జరిగిన ఎన్నికల్లో 1.70 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదవ్వగా 69.7 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. ఈసారి 2.82 లక్షలకు పైగా ఓటర్లు నమోదైన తరుణంలో పోలింగ్ శాతం కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం నుంచి 2017లో ఎన్నికైన పీవీఎన్ మాధవ్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు రంగం సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల నియమావళి జిల్లాలో 9వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజికవర్గానికి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు వివరించారు.